424) రామక్రియ

ప॥ ఇంతకంటే దగుబంధు లింక నున్నారా । యెంతసేసినా నీకు నెదురాడేనా ॥

చ॥ కోపగించి చంకబిడ్డ గోరి తల్లి దించితేను । పైపై నే పడుగాక పాసిపొయ్యీనా ।
వోపక నానేరముల కొగి నీవు వేసరితే । నీపాదాలే గతిగాక నే మానేనా ॥

చ॥ చదివించే అయ్యగారు జంకించి చూచితేను । వొదిగి చదువుగాక వోపవసీనా ।
యెదుటిగుణములకు నెంత నీవు దొబ్బినాను । యిదె నీకే మొక్కుదుగా కింక మానేనా ॥

చ॥ చెక్కు మీటి పాలు పెంచినదాది వోయగాను । గక్కన మింగుటగాక కాదనీనా ।
యిక్కడ శ్రీవేంకటేశ యిటుల రక్షించగ । నిక్కి నే మెరతుగాక నే మానేనా ॥